RNI No Tel / 2012 /4241

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..

# హైదరాబాద్ ఎస్టేట్

తెలుగు దిన పత్రిక

THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER

hyderabadestate.co.in

సంపుటి -13 సంచిక - 444 | 8 శనివారం ఆగస్టు 2026 | ఎడిటర్: బట్టు లక్ష్మీ నారాయణ | పేజీలు - 6 వెల రూ 5 /--




## వర్షాల కోసం తెలంగాణ ప్రభుత్వం

# వరుణయాగం..

- ఆగస్టు 10న నాగార్జునసాగర్‌లో వరుణయాగం
- యాగం నిర్వహించనున్న యాదగిరిగుట్ట ఆలయ వేద పండితులు, అర్చకులు
- పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొననున్న రేవంత్ రెడ్డి



రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి నదులు, జలాశయాలు జలకళ సంతరించుకోవాలని, పంటలు బాగా పండాలని ఆకాంక్షిస్తూ తెలంగాణ ప్రభుత్వం వరుణ యాగం నిర్వహించాలని నిర్ణయించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సారథ్యంలో ఆగస్టు 10వ తేదీన ఉమ్మడి నల్గొండ జిల్లా నాగార్జునసాగర్‌లోని విజయ విహార్ ప్రాంగణంలో ఈ యాగం వైభవంగా జరగనుంది. ఎల్ నినో ప్రభావం నుంచి విముక్తి కలిగి, కృష్ణా-గోదావరి నదులతో పాటు రైతాంగం సుభిక్షంగా ఉండాలనే ప్రత్యేక సంకల్పంతో ఈ మహా క్రతువును చేపడుతున్నారు. యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి చెందిన వేద పండితులు, అర్చకులతో పాటు మొత్తం 108 మంది రుత్వికులు 11 హోమకుండాలలో ఈ యాగాన్ని నిర్వహించనున్నారు. యాగ పూర్ణాహుతి కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యక్షంగా పాల్గొననున్నారు. రాష్ట్ర శ్రేయస్సును కాంక్షిస్తూ ఈ మహా వరుణ యాగాన్ని నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారని యాదగిరిగుట్ట దేవస్థానం పాలక మండలి చైర్మన్ తెలిపారు.

## జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో

# బీజేపీ ఒంటరి పోరు

### : రామచందర్ రావు



గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్‌ఎంసీ) ఎన్నికల్లో బీజేపీ ఒంటరిగానే పోటీ చేస్తుందని ఆ పార్టీ తెలంగాణ విభాగం అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు స్పష్టం చేశారు. రానున్న ఎన్నికల్లో ఎటువంటి పొత్తులు లేకుండానే బరిలోకి దిగుతామని ఆయన ప్రకటించారు. ఢిల్లీలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్‌తో భేటీ అనంతరం రామచందర్ రావు మీడియాతో మాట్లాడారు. "తెలంగాణలో బీజేపీ ఎవరితోనూ పొత్తులు పెట్టుకోదు. జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ చేస్తాం" అని ఆయన ఉద్ఘాటించారు. రాష్ట్ర పార్టీ నేతల మధ్య విభేదాలు లేవని, కేవలం అభిప్రాయ భేదాలు మాత్రమే ఉన్నాయని పేర్కొన్నారు. సరైన సమయం చూసి పలువురు కీలక నేతలు బీజేపీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారని ఆయన వెల్లడించారు. తెలంగాణ ప్రభుత్వంలో పెరుగుతున్న అవినీతిపై పోరాడాలని, అధికారంలోకి వచ్చేందుకు పక్కా రోడ్‌మ్యాప్ సిద్ధం చేసుకోవాలని జాతీయ నాయకత్వం తమకు సూచించినట్లు రామచందర్ రావు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలు, ఆరు గ్యారెంటీల అమలు తీరును ప్రజల్లోకి బలంగా తీసుకెళతామని చెప్పారు. అసెంబ్లీ సమావేశాల అనంతరం ఎంపీలు, ఎమ్మెల్యేలతో మరోసారి సమావేశం ఉంటుందని ఆయన తెలిపారు. అన్ని మండలాల్లో పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయడంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఆయన వివరించారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో తెలంగాణలో 'డబుల్ ఇంజిన్ సర్కార్'ను ఏర్పాటు చేయడమే తమ అంతిమ లక్ష్యమని పునరుద్ఘాటించారు. రానున్న జీహెచ్‌ఎంసీ ఎన్నికలు రాష్ట్రంలో పార్టీ బలాన్ని నిరూపించుకోవడానికి ఒక కీలకమైన మైలురాయిగా నిలుస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు.

## చేనేత కార్మికుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం..

### చేనేత రంగానికి రూ.980 కోట్లు విడుదల: మంత్రి తుమ్మల



చేనేత కార్మికుల సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర వ్యవసాయ, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా పీపుల్స్ ప్లాజాలో 100కు పైగా స్టాల్స్‌తో ఏర్పాటు చేసిన చేనేత వస్త్ర ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. భారతీయ సంస్కృతికి, వారసత్వానికి చేనేత ప్రతీక అని, గద్వాల, పోచంపల్లి, నారాయణపేట వస్త్రాలకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు ఉందన్నారు. ప్రతి ఒక్కరూ చేనేత ఉత్పత్తులను కొనుగోలు చేసి నేతన్నలను ప్రోత్సహించాలని ఆయన పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతన్నకు, నేతన్నకు సమాన ప్రాధాన్యతను ఇస్తోందని మంత్రి తెలిపారు. చేనేత రంగానికి ఇప్పటివరకు రూ.980 కోట్లు విడుదల చేశామని, అందులో చేనేత రుణమాఫీ కింద రూ.49.27 కోట్లు మంజూరు చేశామని వెల్లడించారు. 'నేతన్న భరోసా' ద్వారా ఏడాదికి రూ.18,000 ఆర్థిక సాయం, 'నేతన్నకు భద్రత' కింద రూ.5 లక్షల బీమా సౌకర్యాన్ని అందిస్తున్నట్లు చెప్పారు. జియో ట్యాగింగ్‌లో తెలంగాణ అగ్రస్థానంలో ఉందని, ఐఐహెచ్‌టీ ద్వారా యువతకు ఆధునిక నైపుణ్య శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. త్వరలోనే పెండింగ్‌లో ఉన్న చేనేత సహకార సంఘాల ఎన్నికలను నిర్వహిస్తామని, ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ చేనేత పురస్కార గ్రహీతలను సత్కరిస్తామని మంత్రి స్పష్టం చేశారు.

# భయపడొద్దు, నేనున్నాను

### : టీఎంసీ-శివసేన రెబల్స్‌కు ప్రధాని మోదీ భరోసా



ప్రధాని నరేంద్ర మోదీ ఎన్డీయేలోని నూతన మిత్రపక్షాలకు, ముఖ్యంగా తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ), శివసేన (ఉద్ధవ్ వర్గం) నుంచి వచ్చిన రెబల్ ఎంపీలకు కీలక భరోసా ఇచ్చారు. "ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు, నేను మీకు అండగా ఉంటాను" అని ఆయన అభయమిచ్చారు. శుక్రవారం ఉదయం తన నివాసంలో సుమారు 45 మంది ఎన్డీయే ఎంపీలతో ఏర్పాటు చేసిన అల్పాహార సమావేశంలో ప్రధాని ఈ వ్యాఖ్యలు చేశారు.

పార్లమెంటు వర్షాకాల సమావేశాలకు పదేపదే అంతరాయం కలుగుతున్న నేపథ్యంలో ఈ భేటీ ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ సమావేశంలో తృణమూల్ రెబల్స్‌తో ఏర్పడిన నేషనలిస్ట్ సిటిజన్స్ పార్టీ ఆఫ్ ఇండియా (ఎన్‌సీపీఐ), ఉద్ధవ్ ఠాక్రే వర్గం నుంచి ఏక్‌నాథ్ షిండే వర్గంలో చేరిన శివసేన ఎంపీలు, ఎన్సీపీ (అజిత్ పవార్) సభ్యులు పాల్గొన్నారు. సభలో గందరగోళం కారణంగా కొత్త ఎంపీలకు మాట్లాడే అవకాశం రాకపోవడం అన్యాయమని ప్రధాని అభిప్రాయపడ్డారు.

ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ, పార్లమెంటును ప్రజాస్వామ్య దేవాలయంగా అభివర్ణించారు. సభా కార్యకలాపాలు సజావుగా సాగాల్సిన అవసరాన్ని ఆయన నొక్కిచెప్పారు. పార్లమెంటు చరిత్రను అధ్యయనం చేసి, చర్చలకు సిద్ధం కావాలని ఎంపీలకు సూచించారు. రాష్ట్రాలు అభివృద్ధి చెందితేనే దేశం పురోగమిస్తుందని పేర్కొంటూ, తమ నియోజకవర్గాల అభివృద్ధి పనుల నిమిత్తం నేరుగా ప్రధానమంత్రి కార్యాలయాన్ని సంప్రదించవచ్చని తెలిపారు. "ఎన్డీయే ఒక కుటుంబం. కూటమిలోని ప్రతి పార్టీకి, ప్రతి ఎంపీకి తగిన గౌరవం ఉంటుంది. నేను ప్రతి ఎంపీకి అండగా ఉంటాను" అని మోదీ హామీ ఇచ్చారు. అనంతరం ఆయన ప్రతి ఒక్కరితో వ్యక్తిగతంగా మాట్లాడారు. ముఖ్యంగా మహారాష్ట్రకు చెందిన షిండే వర్గం ఎంపీలతో మరాఠీలో సంభాషించడం విశేషం.

## కేసులకు భయపడేది లేదు..

# ప్రజల పక్షాన పోరాడుతాం

### : మంచిర్యాల కోర్టుకు హాజరైన బాల్క సుమన్



కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్ని అక్రమ కేసులు పెట్టినా భయపడేది లేదని, ప్రజల పక్షాన పోరాటం కొనసాగిస్తామని బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ అన్నారు. క్యాతనపల్లి మున్సిపల్ ఎన్నికల ఘటనపై నమోదైన కేసు విచారణ నిమిత్తం ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మితో కలిసి ఆయన ఈరోజు మంచిర్యాల జిల్లా కోర్టుకు హాజరయ్యారు. కేసును విచారించిన న్యాయస్థానం తదుపరి విచారణను సెప్టెంబర్ 25కు వాయిదా వేసింది. అనంతరం మీడియాతో మాట్లాడిన బాల్క సుమన్... క్యాతనపల్లి మున్సిపాలిటీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు స్పష్టమైన మెజారిటీ వచ్చినప్పటికీ, కాంగ్రెస్ పార్టీ అక్రమ మార్గాల్లో చైర్మన్, వైస్ చైర్మన్ పదవులను దక్కించుకోవడానికి ప్రయత్నించిందని ఆరోపించారు. బీఆర్ఎస్ కౌన్సిలర్లకు కోట్ల రూపాయలు, బ్లాంక్ చెక్కులు చూపించినా లొంగకపోవడంతోనే తమపై కక్షపూరితంగా తప్పుడు కేసులు పెట్టి జైలుకు పంపారని విమర్శించారు. ప్రతిపక్ష నాయకులకు, బీఆర్ఎస్ సోషల్ మీడియా కార్యకర్తలకు ఒక చట్టం, అధికార పార్టీ నేతలకు మరొక చట్టం అన్నట్లుగా ప్రభుత్వం వ్యవహరిస్తోందని, కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు అయ్యే వరకు పోరాటం ఆపేది లేదని స్పష్టం చేశారు.

## రూ.5 కోట్ల అంశానికి రూ.54 కోట్ల పెనాల్టీపై మంత్రులు కోమటిరెడ్డి, వివేక్ ఆగ్రహం



రోడ్డు పనులు చేపట్టే చిన్న కాంట్రాక్టర్లపై మైనింగ్ శాఖ అధికారులు పది రెట్ల వరకు అతిగా పెనాల్టీలు విధించడంపై రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, మైనింగ్ శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ సచివాలయంలో రహదారుల నిర్మాణం, కాంట్రాక్టర్ల ఇబ్బందులపై జరిగిన ఉన్నత స్థాయి సమీక్షలో వారు మాట్లాడారు. రూ.5 కోట్ల విలువైన అంశానికి ఏకంగా రూ.54 కోట్లు పెనాల్టీ విధించడం అత్యంత దారుణమని, కాంట్రాక్టర్ శ్రీనివాస్ రెడ్డి ఆత్మహత్యకు కారణమైన అధికారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రి వివేక్‌ను కోమటిరెడ్డి కోరారు. అక్రమ మైనింగ్ చేసేవారిని వదిలేసి, రోడ్ల పనులు చేసే అమాయక కాంట్రాక్టర్లను ఇబ్బందులకు గురిచేస్తే సహించేది లేదని మంత్రులు హెచ్చరించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన హ్యామ్ మోడల్ రోడ్ల పనులను వేగవంతం చేసి, 2028 నాటికి రాష్ట్రంలో అద్దం లాంటి రోడ్లు నిర్మించడమే లక్ష్యమని కోమటిరెడ్డి స్పష్టం చేశారు. రోడ్ల నిర్మాణానికి అవసరమైన ఇసుక, మెటల్ పర్మిషన్ల పేరుతో వేధించవద్దని, కాంట్రాక్టర్ల సమస్యలకు తక్షణ పరిష్కారం చూపాలని మైనింగ్ శాఖ అధికారులను మంత్రి వివేక్ ఆదేశించారు.

## సీఎం రేవంత్‌కు కేటీఆర్ బహిరంగ లేఖ!



జాతీయ చేనేత దినోత్సవం వేళ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బహిరంగ లేఖ రాశారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో వేలాది చేనేత కుటుంబాలకు ఆర్థిక ధీమానిచ్చిన 'నేతన్న బీమా', 'నేతన్నకు చేయూత' వంటి గొప్ప పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం నిలిపివేసి నేతన్నలను కోలుకోలేని దెబ్బతీసిందని తన లేఖలో ఆయన మండిపడ్డారు. బతుకమ్మ చీరలు, స్కూల్ యూనిఫారాల తయారీ ఆర్డర్లను పక్కనబెట్టి, కమీషన్ల కోసం ప్రైవేటు వ్యక్తులకు కట్టబెడుతున్నారని విమర్శించారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ హామీ ఇచ్చిన రూ.18 వేల ఆర్థిక సాయం, రూ.లక్ష వ్యక్తిగత రుణమాఫీ, 5 శాతం జీఎస్టీ రీయింబర్స్‌మెంట్ హామీలు నెరవేర్చడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని కేటీఆర్ దుయ్యబట్టారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బోర్డులను రద్దు చేసి, జీఎస్టీ విధించి దెబ్బతీస్తే.. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్న పథకాలను నిలిపివేసి నేతన్నలను మోసం చేసిందని ఆరోపించారు. ప్రభుత్వం ఇప్పటికైనా కక్షపూరిత వైఖరి వీడి, రద్దు చేసిన పథకాలను తక్షణమే పునరుద్ధరించి నేతన్న కుటుంబాలకు అండగా నిలవాలని ఆయన డిమాండ్ చేశారు.

RNI No Tel / 2012 /4241
హైదరాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in
8 శనివారం ఆగస్టు 2026

# బి.పి మండల్ స్ఫూర్తితో చట్టసభల్లో ఒబిసి ల వాటా సాధిద్దాం

## - ఆధిపత్య దోపిడి కుల రాజకీయ పార్టీలను చిత్తుగా ఓడిద్దాం
## - బి.సి లు స్వతంత్ర రాజకీయ శక్తిగా ఎదిగిన నాడే విముక్తి
## - ఆల్ ఇండియా ఒబిసి జాక్ చైర్మన్ సాయిని నరేందర్

హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ ప్రతినిధి ప్రతినిధి హనుమకొండ
హనుమకొండలో మండల్ డే
దేశాభివృద్ధిలో కీలకపాత్ర పోషించిన ఇతర వెనుకబడిన వర్గాలు (ఒబిసి) ల సుదీర్ఘ పోరాటం వల్ల నియమించబడిన మండల్ కమీషన్ నివేదికలోని ఒక అంశమైన విద్య, ఉద్యోగాల్లో ఒబిసి లకు రిజర్వేషన్లు కల్పిస్తామని పార్లమెంటులో ఆనాటి ప్రధాని వి.పి సింగ్ ప్రకటించిన రోజును (ఆగస్టు 7) ఆల్ ఇండియా ఒబిసి జాక్ చైర్మన్ సాయిని నరేందర్ ఆధ్వర్యంలో హనుమకొండ జిల్లా కేంద్రం ఒబిసి ప్రజలు బి.సి ల స్వాభిమాన దినోత్సవంగా, మండల్ డే జరుపుకుంటారు. ఆ సందర్భంగా ఆల్ ఇండియా ఒబిసి జాక్ ఆధ్వర్యంలో శుక్రవారం హనుమకొండ జిల్లా కేంద్రం అంబేద్కర్ సెంటర్ వద్ద బి.పి మండల్ చిత్రపటానికి దండ వేసి నివాళులు అర్పించి వివిధ ప్రజా సంఘాల నాయకులు మాట్లాడారు.

సాయిని నరేందర్ మాట్లాడుతూ 1980 లో సమర్పించిన బి.పి మండల్ కమీషన్ నివేదికను పదేళ్ల తర్వాత 1990 ఆగష్టు 7 న ఆనాటి ప్రధాని వి.పి సింగ్ అమలు చేయడానికి పార్లమెంటులో ప్రకటించగానే దేశంలోని రాజకీయ పార్టీలన్నీ గగ్గోలు పెట్టాయని. పీడిత ప్రజల పక్షాన పోరాడే కమ్యూనిస్టు పార్టీలు సైతం మండల్ కు వ్యతిరేకంగా, ఒబిసి రిజర్వేషన్లకు వ్యతిరేకంగా పోరాటం చేసినాయని, మీడియా మొత్తం మండల్ వ్యతిరేక ఉద్యమానికి సంపూర్ణ మద్దతు ఇచ్చినారని అన్నారు. జనతాదళ్ ప్రభుత్వానికి బయట నుండి మద్దతు ఇస్తున్న బిజెపి తన మద్దతును ఉపసంహరించుకుని జనతాదళ్ ప్రభుత్వాన్ని కూలదోసిందని, తన ప్రభుత్వం కూలిపోతుందని తెలిసి కూడా అనాటి జనతాదళ్ పార్టీ, ప్రధాని వి.పి సింగ్ ఒబిసి రిజర్వేషన్లు కల్పించారని అన్నారు. అలాంటి ప్రత్యేక దినాన్ని ఉత్సవంగా జరుపుకోవడమే కాకుండా మండల్ డే స్ఫూర్తితో బి.సి హక్కుల సాధనకు బహుజన సమాజం ఐక్యంగా పోరాడాల్సిన అవసరముందని అన్నారు. బి.సి రిజర్వేషన్ల విషయంలో, జనగణన విషయంలో బిజెపి, కాంగ్రెస్ రెండు పార్టీలు మోసం చేశాయని, ఉత్పత్తి శక్తిగా ఉన్న ఒబిసి సమాజం రాజకీయ శక్తిగా ఎదిగిన రోజునే రాజ్యాధికారం, సామాజిక న్యాయం, చట్టసభల్లో వాటా సాధ్యమవుతుందని అన్నారు.



ఈ కార్యక్రమంలో పాల్గొన్న బి.సి ఇంటలెక్చువల్ ఫోరం ఉమ్మడి వరంగల్ జిల్లా చీఫ్ కోఆర్డినేటర్ డాక్టర్ కొంగ వీరస్వామి మాట్లాడుతూ బి.సి సమాజం నుండి ఎదిగిన మేధావులు, లాయర్లు, డాక్టర్లు, ఇంజనీర్లు, వ్యాపారస్థులు బి.సి హక్కుల కోసం పోరాటంలో ముందుండాలని అన్నారు. ఐక్య ఉద్యమాలతో దేశ వ్యాప్త ఉద్యమం చేసిన నాడే మండల్, వి.పి సింగ్ లాంటి త్యాగధనుల ఆశయాలు సాధన జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రజక రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు చాపర్తి కుమార్ గాడ్గే మాట్లాడుతూ బహుజనుల విముక్తి కోసం దేశంలో జరిగిన పోరాటాలను అధ్యయనం చేయాలని, మహాత్మ జ్యోతిరావు పూలే మొదలు కాన్షీరామ్ వరకు మహనీయుల పోరాట మెలుకువులను తెలుసుకోవాలని, ప్రతి ఒక్క బి.సి నాయకుడు మండల్ నివేదికను అధ్యయనం చేసి వి.పి సింగ్ లాగా ధైర్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. అంబేద్కర్ ఇచ్చిన ఓటు ఆయుధాన్ని అమ్ముకున్నంత కాలం బి.సి సమాజం బానిసలుగానే బతకాల్సి వస్తుందని అన్నారు.

ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మధుపాక ఎల్లన్న, డిబిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చుంచు రాజేందర్, హనుమకొండ జిల్లా అధ్యక్షులు మాదాసి సురేష్, ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు జన్ను పద్మ, వివిధ సంఘాల నాయకులు తుమ్మ తిరుపతి, అంకేశ్వరపు రాంచందర్, సద్గుణ, సూరం నిరంజన్ పటేల్, స్వరూప, జల్లెల కృష్ణమూర్తి, మీరాస్వామి యాదవ్, సురేఖ, బైరి దీప, జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

# HNK__ ABSF ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడి.. నాయకుడు నరేష్ అరెస్టు

రిపోర్టర్: హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి భాస్కర్ హన్మకొండ
రాష్ట్రవ్యాప్తంగా ఉన్న విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈరోజు ~ాదీూఖీ నాయకుడు నరేష్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడి నిర్వహించారు. పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ, పెండింగ్‌లో ఉన్న పీజీ రియంబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే చెల్లించాలని, స్కాలర్షిప్ బకాయిలను కూడా తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్ రెడ్డి విద్యాశాఖ మంత్రిగా పూర్తిగా ఫెయిలయ్యారని ఆరోపించారు. విద్యార్థుల సమస్యలపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని విమర్శించారు. కలెక్టరేట్ ముట్టడిలో పాల్గొన్న నరేష్‌ను పోలీసులు అరెస్టు చేసి తరలించారు. విద్యార్థుల డిమాండ్లు నెరవేర్చే వరకు ఆందోళనలు కొనసాగిస్తామని ABSF నాయకులు హెచ్చరించారు.




# మహిళ సాధికారతకు ప్రభుత్వం పెద్దపీట...

## మహిళలకు ఇందిరమ్మ చీరలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే KR నాగరాజు గారు...

హైద్రాబాద్ ఎస్టేట్ ప్రతినిధి భాస్కర్
కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేయడమే ప్రభుత్వ లక్ష్యమని వర్ధన్నపేట ఎమ్మెల్యే,విశ్రాంత ఐపీఎస్ అధికారి శ్రీ కేఆర్ నాగరాజు గారు అన్నారు.శుక్రవారం ఎర్రగట్టుగుట్ట వెంకటేశ్వర కళ్యాణ మండలంలో 65,66వ డివిజన్లకు చెందిన మహిళలకు ఇందిరమ్మ చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ...కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల అభ్యున్నతికి అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని.గ్రామీణ,పట్టణ ప్రాంతాల్లో మహిళల జీవిత స్థాయిని మెరుగుపరచడానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రయత్నాలు చేస్తోందని ఆయన తెలిపారు.రాష్ట్రంలో మహిళా సాధికారత, స్వయం సహాయక సంఘాల అభివృద్ధి కోసం ఈ పథకాన్ని ప్రభుత్వం చేపట్టిందన్నారు.అర్హులైన పేద మహిళలకు, మహిళా సంఘాల సభ్యులకు ఈ చీరలను అందజేస్తామన్నారు.అర్హులైన ప్రతీ మహిళకు ఇందిరమ్మ చీరలు పంపిణీ అయ్యేలా పారదర్శకంగా, ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని అధికారులకు సూచించారు. కుటుంబ అభ్యున్నతిలో మహిళలే కీలకమని,భవిష్యత్ తరాల బాగు కోసం పిల్లలను చక్కగా చదివించాలని హితువు పలికారు.రేషన్ కార్డులు,ఇందిరమ్మ ఇండ్లు తదితర వాటిని ప్రభుత్వం మహిళల పేరుతోనే మంజూరు చేస్తోందని, మహిళల అభ్యున్నతికి పెద్దపీట వేస్తోందని అన్నారు.కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే సంకల్పంతో అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందని తెలిపారు.



ఈ కార్యక్రమంలో 66వ డివిజన్ అధ్యక్షులు కిరణ్ గారు,65వ డివిజన్ అధ్యక్షులు సునీల్,ఆత్మకూరు మార్కెట్ వైస్ చైర్మన్ తిరుపతి,మండల అధ్యక్షులు అశోక్ కుమార్,మహిళ అధ్యక్షురాలు జోరిక పూల,మహిళ ఉప అధ్యక్షురాలు స్వాతి,మాజీ మండల అధ్యక్షులు మహేందర్ రెడ్డి,సీనియర్ నాయకులు వీసం సురేందర్ రెడ్డి,వంగపహాడ్ PACS చైర్మెన్ మెరుగు రాజేష్ గౌడ్,మండల,డివిజన్ స్థాయి నాయకులు, కార్యకర్తలు,అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఈవీఎం భద్రతపై కలెక్టర్ నారాయణ రెడ్డి ప్రత్యేక దృష్టి

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఆగస్టు 7:-
రాజేంద్రనగర్:రాబోయే ఎన్నికల ప్రక్రియలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల భద్రత, భద్రపరిచే విధానంలో ఎలాంటి లోపాలు లేకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం రాజేంద్రనగర్‌లోని ఈవీఎం గోడౌన్‌ను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు.
సాధారణ తనిఖీల్లో భాగంగా గోడౌన్‌కు ఏర్పాటు చేసిన భద్రతా సీళ్లను కలెక్టర్ పరిశీలించి, వాటి పరిస్థితిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, ఓటరు ధృవీకరణ పత్రం ముద్రణ యంత్రాలు సహా ఎన్నికలకు సంబంధించిన ఇతర సామగ్రిని ఏ విధంగా భద్రపరుస్తున్నారో పరిశీలించారు. యంత్రాల నిల్వ, రక్షణ, గోడౌన్ నిర్వహణలో నిర్దేశిత నిబంధనలను కచ్చితంగా పాటించాలని సూచించారు.అనంతరం గోడౌన్ వద్ద ఏర్పాటు చేసిన పోలీసు బందోబస్తు, భద్రతా వ్యవస్థలను పరిశీలించిన కలెక్టర్.. ఎన్నికల సామగ్రి రక్షణ విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలని అధికారులకు స్పష్టం చేశారు. ఎలాంటి అనధికారిక ప్రవేశాలకు అవకాశం లేకుండా నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని ఆదేశించారు.అనంతరం రాజేంద్రనగర్ తహశీల్దార్ కార్యాలయంలో కొనసాగుతున్న ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను కూడా కలెక్టర్ పరిశీలించారు. ప్రక్రియను నిబంధనల ప్రకారం పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు.




ఈ తనిఖీలో రాజేంద్రనగర్ తహశీల్దార్, గోడౌన్ ఇన్‌చార్జి రాములు, ఎన్నికల విభాగం అధికారులు రవీంద్ర గుప్తా, పోలీసు అధికారులు, సంబంధిత శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

# బిజెపి మండల పార్టీ అధ్యక్షుడిగా హన్మంత్ ఎన్నిక,

హైదరాబాద్ ఎస్టేట్ నూతనకల్ (ప్రతినిధి)
మండల పరిధిలోని బిక్కుమల్ల గ్రామానికి చెందిన కప్పల హనుమంతు నూతనకల్ మండల బిజెపి పార్టీ అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. అనంతరం ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకం తో మండల బాధ్యతలు అప్పజెప్పిన జిల్లా అధ్యక్షులకు చల్ల శ్రీలత రెడ్డి మరియు మండల నాయకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. బిజెపి పార్టీ చేస్తున్న అభివృద్ధి పనులను మండల ప్రజలకు వివరిస్తూ బిజెపిని బలోపేతం చేస్తానని నా ఎన్నికలకు సహకరించిన మండల నాయకులు అందరికీ పేరుపేరునా రుణపడి ఉంటానని నా వంతు సహాయం పార్టీకి అందజేస్తానని వారు తెలిపారు.



# రెసోనన్స్ పాఠశాలలో బోనాల జాతర

హైదరాబాద్ఎస్టేట్ మద్దిరాల (ప్రతినిధి)
మండలం పరిధి లోని రెసోనన్స్ పాఠశాలలో ముందస్తు బోనాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించామని పాఠశాల ప్రిన్సిపల్ పాలబిందెల శ్రీనివాస్ కరస్పాండెంట్ శిరంశెట్టి వెంకన్న తెలిపారు ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థుల పోతరాజు వేషాలు నృత్యాలు చూపరులను ఆకట్టుకున్నాయి పిల్లలకు చదువుతోపాటు తెలంగాణ సాంస్కృతి సాంప్రదాయాలను అలవాటు చేయడమే ముఖ్య ఉద్దేశమని పాఠశాల యాజమాన్యం తెలిపారు. తెలంగాణలోని ఆచారంగా భావించే బోనాలను బోనాల సందర్భంగా వేసే వివిధ వేశాదారులను చేసి ప్రజలను మైనార్పించిన విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు విద్యార్థినీ విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులు పెద్ద ఎత్తున పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసినారు




# మద్దిరాల బిజెపి మండల పార్టీ అధ్యక్షుడిగా అశోక్ ఎన్నిక,

హైదరాబాద్ ఎస్టేట్ మద్దిరాల (ప్రతినిధి)
మండల పరిధిలోని గుమ్మడవెల్లి గ్రామానికి చెందిన వల్లపు అశోక్ మద్దిరాల మండల బిజెపి పార్టీ అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. అనంతరం ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకం తో మండల బాధ్యతలు అప్పజెప్పిన జిల్లా అధ్యక్షులకు చల్ల శ్రీలత రెడ్డి మరియు మండల నాయకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. బిజెపి పార్టీ చేస్తున్న అభివృద్ధి పనులను మండల ప్రజలకు వివరిస్తూ బిజెపిని బలోపేతం చేస్తానని నా ఎన్నికలకు సహకరించిన మండల నాయకులు అందరికీ పేరుపేరునా రుణపడి ఉంటానని నా వంతు సహాయం పార్టీకి అందజేస్తానని వారు తెలిపారు.



# ఆరుతడి పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారి

హైదరాబాద్ స్టేట్ మద్ధిరాల (ప్రతినిధి)
మండలంలోని గోరెంట్ల గ్రామం లో రైతులు సాగు చేస్తున్న పెసర పంటను ఈరోజు వ్యవసాయ శాఖ అధికారులు అనిశారూహి మరియు ఏ ఈ ఓ క్షేత్రస్థాయిలో సందర్శించారు. అనంతరం వ్యవసాయ అధికారి మాట్లాడుతూ పంటలో చీడపీడల నివారణ, సమగ్ర సస్యరక్షణ పద్ధతులు, సకాలంలో యాజమాన్య చర్యలు చేపట్టాలని రైతులకు తెలియచేయడం జరిగింది. ఎలినినో ఎఫెక్ట్ నేపథ్యంలో ఆరుతడి పంటలైన కందులు, బొబ్బర్లు, మినుములు వంటివి సాగు చేయవలసిందిగా సూచించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రైతులు అది సంఖ్యలో పాల్గొన్నారు.



# ప్రపంచ ఆదివాసీల దినోత్సవ కరపత్రావిష్కరణ.
# పల్నాడు జిల్లా గిరిజన సంక్షేమ శాఖ, సాధికారిత అధికారి బి.గోవింద్ నాయక్.




నరసరావుపేట. ఆగస్టు 7.
ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య ఆధ్వర్యంలో ఈనెల 9వ తేదీన యడ్లపాడు మండలంలోని గల బోయపాలెంలోని ఉన్నవ గ్రామ గిరిజన కమ్యూనిటీ హాల్ నందు ప్రపంచ ఆదివాసీల దినోత్సవం సాయంత్రం ఐదు గంటలకు నిర్వహించడం జరుగుతుంది. దీనికి సంబంధించిన కరపత్ర ఆవిష్కరణ జిల్లా గిరిజన సంక్షేమ శాఖ,సాధికారిత అధికారి బి.గోవింద్ నాయక్ శుక్రవారం తన ఛాంబర్ లో గిరిజన సంఘాల నాయకులతో కలిసి ఆవిష్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న గిరిజన సంఘ నాయకులు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నటువంటి గిరిజన ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించాలని, అడవి భూములను సాగు చేసుకుంటున్నా వారికి పట్టాలు మంజూరు అయ్యేవిధంగా చూడాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ అధికారికంగా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహిస్తున్న ఆదివాసుల దినోత్సవం సందర్భంగా ప్రజల సమస్యలు వినేవేసులుబాటు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గిరిజన సమాఖ్య రాష్ట్ర సహాయ కార్యదర్శి బి .శ్రీను నాయక్, గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వీ.కోట నాయక్, విద్యార్థి సేవ రాష్ట్ర అధ్యక్షులు కేతావతు పాండు నాయక్, ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం జిల్లా అధ్యక్షులు వి. రవి నాయక్, జిల్లా ఉపాధ్యక్షులు మెగావతు శ్రీను నాయక్, ఏకలవ్య సంక్షేమ సంఘం నాయకులు మేడ పోతురాజు, డి బి ఆర్ సి నరసరావుపేట ఏరియా కోఆర్డినేటర్ తోకల సాంబయ్య నకరికల్లు ఏరియా కోఆర్డినేటర్ జి.కోటి రత్నం, ఆంధ్రప్రదేశ్ ట్రైబల్ వెల్ఫేర్ సొసైటీ వినుకొండ ఎం.సురేష్ తో పాటు పలువురు గిరిజన నాయకులు పాల్గొన్నారు.

RNI No Tel / 2012 /4241
హైదరాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in
8 శనివారం ఆగస్టు 2026

## 2047 కోసం యువతకు మంత్రి జూపల్లి పిలుపు




హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఆగస్టు 7:-
భారత్‌ను 2047 నాటికి అభివృద్ధి చెందిన, స్వావలంబన కలిగిన దేశంగా తీర్చిదిద్దేందుకు యువత, పరిశోధన, సాంకేతిక ఆవిష్కరణలు కీలకమని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. హైదరాబాద్‌లోని కన్హా శాంతి వనంలో పాలమూరు విశ్వవిద్యాలయం, కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన "విజన్ ఇండియా2047" జాతీయ సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.ఏఐ, డేటా సైన్స్, బయోటెక్నాలజీ, సెమీకండక్టర్లు, పునరుత్పాదక ఇంధనం, అంతరిక్ష సాంకేతికత, స్టార్టప్‌ల వంటి రంగాల్లో పరిశోధనలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం 2047 నాటికి తెలంగాణను మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే దిశగా పనిచేస్తోందని తెలిపారు.ఆర్థికాభివృద్ధితో పాటు ప్రజల జీవన ప్రమాణాల్లో మార్పు రావాలని మంత్రి పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాలు అప్పుల భారంలో చిక్కుకోకుండా ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా స్వయం సమృద్ధి సాధించేలా చర్యలు అవసరమన్నారు. నాణ్యమైన ప్రభుత్వ విద్య, వైద్య సేవలను బలోపేతం చేయడం అత్యంత ప్రాధాన్యమన్నారు. విశ్వవిద్యాలయాలు బోధనకే పరిమితం కాకుండా పరిశోధన, ఆవిష్కరణలు, నైపుణ్యాభివృద్ధి, పారిశ్రామికవేత్తల తయారీకి కేంద్రాలుగా ఎదగాలని సూచించారు. ప్రభుత్వం, విశ్వవిద్యాలయాలు, పరిశ్రమల మధ్య సమన్వయంతో యువతకు విస్తృత అవకాశాలు కల్పించవచ్చన్నారు. సదస్సులోని చర్చలు 2047 లక్ష్యాల సాధనకు ఆచరణాత్మక మార్గాలను చూపుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

## పోలీస్ కొలువుల కోసం ఉచిత శిక్షణ..
### యువతకు మల్‌రెడ్డి యువశక్తి అండ



హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఆగస్టు 7:-
ఇబ్రహీంపట్నం: పోలీస్ ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో ఉన్న యువతకు అండగా నిలిచేందుకు ఎంఆర్ఆర్ ఫౌండేషన్, మల్‌రెడ్డి యువశక్తి ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా ఈ నెల 9వ తేదీ నుంచి పోలీస్ ఉద్యోగార్థుల దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం కానుంది. ఇబ్రహీంపట్నం మంచాల రోడ్డులోని బైపాస్ వద్ద జరిగే ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ప్రారంభించనున్నారు.కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను మల్‌రెడ్డి యువశక్తి సారథి మల్‌రెడ్డి అభిషేక్‌రెడ్డి పరిశీలించారు. భారత్ గార్డెన్ నుంచి సాగర్ రోడ్డు వరకు నిర్మించిన బైపాస్ ఎంట్రెన్స్ వద్ద దరఖాస్తుల స్వీకరణకు అవసరమైన ఏర్పాట్లపై కాంగ్రెస్ పార్టీ నాయకులు, కౌన్సిలర్లు, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ ప్రతినిధులతో ఆయన సమీక్షించారు. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక కౌంటర్లు, తాగునీరు, పార్కింగ్, మౌలిక వసతులు, స్వచ్ఛంద కార్యకర్తల ఏర్పాటు వంటి అంశాలపై సూచనలు చేశారు.పోలీస్ ఉద్యోగాల ఉచిత శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ ఈ నెల 9 నుంచి 15వ తేదీ వరకు కొనసాగుతుందని అభిషేక్‌రెడ్డి తెలిపారు. అవసరాన్ని బట్టి గడువు పొడిగించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. అలాగే ఇబ్రహీంపట్నంలోని ప్రజాభవన్‌లో ఈ నెల 10వ తేదీ నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామని చెప్పారు.పోలీస్ ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో ఉన్న యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అభిషేక్‌రెడ్డి పిలుపునిచ్చారు. ప్రభుత్వ ఉద్యోగాలకు పోటీ పెరుగుతున్న నేపథ్యంలో ముందుగానే ప్రణాళికతో సిలబస్‌కు అనుగుణంగా సిద్ధం కావాలని సూచించారు. నిరుద్యోగ యువతకు తమ వంతు సహకారం అందించేందుకే ఉచిత శిక్షణ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చేలా కష్టపడి చదివి ఉద్యోగం సాధించాలని ఆకాంక్షించారు.

## ఆగస్టు 10 జైల్‌భరోను జయప్రదం చేయాలి



హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఆగస్టు 7:-
ఇబ్రహీంపట్నం: కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఆగస్టు 10న నిర్వహించనున్న జైల్‌భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జీహెచ్ఎంసీ ఎంప్లాయీస్ యూనియన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఆలేటి ఎల్లయ్య పిలుపునిచ్చారు. క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో చేపడుతున్న ఈ ఆందోళనకు కార్మికులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు.ఈ సందర్భంగా జీహెచ్ఎంసీ కార్మికులకు ఆగస్టు 10న చేపట్టనున్న కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేసి అవగాహన కల్పించారు. అనంతరం ఆలేటి ఎల్లయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా దేశవ్యాప్తంగా ఆందోళనలు చేపడుతున్నట్లు తెలిపారు. రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట కూడా నిరసన కార్యక్రమం నిర్వహించనున్నట్లు వెల్లడించారు.కార్మికుల హక్కులను పరిరక్షించేందుకు తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ సవరణ బిల్లును ఉపసంహరించుకోవడంతో పాటు 12 గంటల పని విధానాన్ని రద్దు చేయాలని కోరారు. జీహెచ్ఎంసీ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు.రైతులను, వ్యవసాయ కార్మికులను తీవ్రంగా ప్రభావితం చేసే విధానాలను కేంద్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని అన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం సాగిన క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో నేటి ప్రజా సమస్యలపై కార్మికులు, రైతులు, ప్రజాస్వామ్యవాదులు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు సీహెచ్ జంగయ్యతో పాటు కళావతి, యాదమ్మ, సురేష్, అనురాధ, సామ పద్మ, హేమలత, లక్ష్మి, పున్నమ్మ, అమృత, రాజేశ్వరి, పుల్లమ్మ, మంజుల తదితరులు పాల్గొన్నారు.

# చేనేత కార్మికుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- చేనేత వస్త్రాల కొనుగోలుతో నేతన్నలకు భరోసా
- చేనేత రంగానికి వరంగల్ నగరం వేదిక
- వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి
- హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించిన జాతీయ చేనేత దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, ఇన్చార్జి కలెక్టర్ రవి



హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి భాస్కర్‌హనుమకొండ: చేనేత కార్మికుల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం అని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు.శుక్రవారం జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా జిల్లా చేనేత, జౌళి శాఖ ఆధ్వర్యంలో హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ చేనేత అనేది కేవలం ఒక వృత్తి మాత్రమే కాదని, భారతీయ సంస్కృతి, సంప్రదాయం, కళాత్మక నైపుణ్యానికి ప్రతీక అన్నారు. తెలంగాణలో చేనేత రంగానికి విశిష్టమైన చరిత్ర ఉందని, ముఖ్యంగా వరంగల్ ప్రాంతం దేశవ్యాప్తంగా చేనేత కళకు ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చిందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేనేత కార్మికుల సంక్షేమాన్ని అత్యంత ప్రాధాన్యంగా తీసుకుంటోందని, వారి జీవనోపాధి మెరుగుపడేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటోందని తెలిపారు. చేనేత ఉత్పత్తులకు మార్కెట్ విస్తరణ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, వినూత్న డిజైన్లు, నైపుణ్యాభివృద్ధి శిక్షణలకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. అలాగే ముడి సరుకు, రుణ సౌకర్యాలు, బీమా, సంక్షేమ పథకాలు మరింత సమర్థవంతంగా అందేలా ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలను కొనుగోలు చేసి చేనేత కార్మికులకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. చేనేత కార్మికుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ముఖ్యంగా హనుమకొండ జిల్లాలోని చేనేత కార్మికుల సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తానని తెలిపారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని చేనేత కార్మికుల అభ్యున్నతికి అవసరమైన మౌలిక సదుపాయాలు, సంక్షేమ కార్యక్రమాల కోసం నిరంతరం కృషి చేస్తానని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా చేనేత రంగానికి చేయూతనిచ్చే విధంగా డిపిఆర్ తయారుచేసి ఇవ్వాలని, డిపిఆర్ ను సీఎం దృష్టికి తీసుకు వెళ్తానని పేర్కొన్నారు. చేనేత రంగాన్ని పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. చేనేతను కాపాడుకుంటూ చేనేత కార్మికులకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. చేనేత కార్మికులందరికీ జాతీయ చేనేత దినోత్సవ శుభాకాంక్షలను ఎమ్మెల్యే తెలియజేశారు. ఈ సమావేశంలో జిల్లా ఇన్చార్జి కలెక్టర్ రవి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేనేత రంగానికి ప్రోత్సాహాన్ని అందిస్తుందన్నారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి సూచించిన విధంగా చేనేత సంఘం ప్రతినిధులు చేనేత సంక్షేమానికి డిపిఆర్ తయారుచేసి అందించాలని తెలియజేశారు. అనంతరం చేనేత కార్మికులను ఘనంగా సన్మానించడంతో పాటు చేనేత రంగంపై నిర్వహించిన వ్యాసరచన పోటీలలో ప్రతిభ కనబర్చిన వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించి చేనేత వస్త్రాలతో సన్మానించారు. కలెక్టరేట్ ప్రాంగణంలో జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన చేనేత వస్త్రాల విక్రయ స్టాల్ ను సందర్శించి చేనేత చీరను ఎమ్మెల్యే కొనుగోలు చేశారు. ఈ కార్యక్రమంలో చేనేత జౌళి శాఖ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ జయరాజ్, ఏడీ విజయలక్ష్మి, చేనేత సంఘాల ప్రతినిధులు, చేనేత కార్మికులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఈవీఎం భద్రతపై కలెక్టర్ నారాయణ రెడ్డి ప్రత్యేక దృష్టి




హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఆగస్టు 7:-
రాజేంద్రనగర్:రాబోయే ఎన్నికల ప్రక్రియలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల భద్రత, భద్రపరిచే విధానంలో ఎలాంటి లోపాలు లేకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం రాజేంద్రనగర్‌లోని ఈవీఎం గోడౌన్‌ను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు.
సాధారణ తనిఖీల్లో భాగంగా గోడౌన్‌కు ఏర్పాటు చేసిన భద్రతా సీళ్లను కలెక్టర్ పరిశీలించి, వాటి పరిస్థితిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, ఓటరు ధృవీకరణ పత్రం ముద్రణ యంత్రాలు సహా ఎన్నికలకు సంబంధించిన ఇతర సామగ్రిని ఏ విధంగా భద్రపరుస్తున్నారో పరిశీలించారు. యంత్రాల నిల్వ, రక్షణ, గోడౌన్ నిర్వహణలో నిర్దేశిత నిబంధనలను కచ్చితంగా పాటించాలని సూచించారు.అనంతరం గోడౌన్ వద్ద ఏర్పాటు చేసిన పోలీసు బందోబస్తు, భద్రతా వ్యవస్థలను పరిశీలించిన కలెక్టర్.. ఎన్నికల సామగ్రి రక్షణ విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలని అధికారులకు స్పష్టం చేశారు. ఎలాంటి అనధికారిక ప్రవేశాలకు అవకాశం లేకుండా నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని ఆదేశించారు.అనంతరం రాజేంద్రనగర్ తహశీల్దార్ కార్యాలయంలో కొనసాగుతున్న ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను కూడా కలెక్టర్ పరిశీలించారు. ప్రక్రియను నిబంధనల ప్రకారం పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు.
ఈ తనిఖీలో రాజేంద్రనగర్ తహశీల్దార్, గోడౌన్ ఇన్‌చార్జి రాములు, ఎన్నికల విభాగం అధికారులు రవీంద్ర గుప్తా, పోలీసు అధికారులు, సంబంధిత శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

## వరి ఒక్కటే కాదు.. వాతావరణానికి తగ్గ పంటలే మేలు



హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఆగస్టు 7:-
రంగారెడ్డి జిల్లా:వాతావరణ పరిస్థితుల్లో చోటుచేసుకుంటున్న మార్పులను దృష్టిలో ఉంచుకుని రైతులు సాగు ప్రణాళికను ముందుగానే సిద్ధం చేసుకోవాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి సూచించారు. ఈ నెల 15వ తేదీ తర్వాత వర్షాలు తగ్గే అవకాశం ఉన్న నేపథ్యంలో అధిక నీటి అవసరం ఉన్న వరి సాగుపై పూర్తిగా ఆధారపడకుండా ప్రత్యామ్నాయ పంటలు, కూరగాయల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.ప్రస్తుతం అందుబాటులో ఉన్న నీటి వనరులు, జలాశయాల్లో నీటి నిల్వలు, వాతావరణ అంచనాలను పరిగణనలోకి తీసుకుని రైతులు పంటల ఎంపిక చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. తక్కువ నీటితో సాగు చేయగల కంది, పెసర, మినుము, జొన్న, సజ్జ, మొక్కజొన్న, నువ్వులు తదితర పంటలను స్థానిక పరిస్థితులకు అనుగుణంగా ఎంపిక చేసుకోవాలని తెలిపారు. కూరగాయల సాగు ద్వారా కూడా రైతులు అదనపు ఆదాయాన్ని పొందే అవకాశాలను పరిశీలించాలని సూచించారు.ప్రతి గ్రామంలో వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు పంటల ఎంపిక, సాగు పద్ధతులు, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. రైతులు తమకు సమీపంలోని వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదించి శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేపట్టాలని కోరారు. అనిశ్చిత వర్షపాతం నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా పంట నష్టాలను తగ్గించవచ్చని తెలిపారు. సెప్టెంబర్‌లోనూ సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నందున రైతులు అప్రమత్తంగా వ్యవహరించాలని కలెక్టర్ సూచించారు..

## జనగణన సమాచారంలో కచ్చితత్వమే కీలకం



హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఆగస్టు 7:-
రంగారెడ్డి జిల్లా,జనగణన2027కు సంబంధించిన సమాచారాన్ని క్షేత్రస్థాయిలో పూర్తి స్థాయిలో సేకరించి, ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా పకడ్బందీగా నమోదు చేయాలని రాష్ట్ర జనాభా లెక్కల సంచాలకులు భారతి హోళికేరి జిల్లా అధికారులను ఆదేశించారు. జిల్లా జనగణన హ్యాండ్‌బుక్ రూపకల్పనపై శుక్రవారం హైదరాబాద్ నుంచి జిల్లా కలెక్టర్లు, సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా భారతి హోళికేరి మాట్లాడుతూ, జిల్లా జనగణన హ్యాండ్‌బుక్ భవిష్యత్‌లో జిల్లాల అభివృద్ధి ప్రణాళికలు, ప్రభుత్వ కార్యక్రమాల రూపకల్పనకు కీలక సమాచార వనరుగా ఉపయోగపడుతుందని తెలిపారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అందుబాటులో ఉన్న మౌలిక సదుపాయాలు, ప్రజా సేవలు,సామాజికఆర్థిక పరిస్థితులకు సంబంధించిన వివరాలను సమగ్రంగా నమోదు చేయాలన సూచించారు.ప్రత్యేకంగా విద్యాసంస్థలు, వైద్య సదుపాయాలు, తాగునీరు, పారిశుద్ధ్యం, రవాణా, విద్యుత్, కమ్యూనికేషన్, బ్యాంకింగ్, వ్యవసాయం, సాగునీరు, పరిశ్రమలు, చేతివృత్తులు తదితర అంశాలపై ఖచ్చితమైన సమాచారాన్ని సేకరించాలన్నారు. పట్టణ ప్రాంతాల్లో పౌర సదుపాయాలు, పరిశ్రమలు, సామాజిక మౌలిక వసతులు, మురికివాడలకు సంబంధించిన వివరాలను కూడా సమగ్రంగా నమోదు చేయాలని ఆదేశించారు.అన్ని శాఖల జిల్లా అధికారులు తమ పరిధిలోని సమాచారాన్ని నిర్ణీత గడువులో సంబంధిత అధికారులకు అందించాలని సూచించారు. డీసీహెచ్‌బీ పోర్టల్, మొబైల్ అప్లికేషన్ ద్వారా వివరాల నమోదులో నాణ్యతా ప్రమాణాలను పాటించాలని స్పష్టం చేశారు.విలేజ్ డైరెక్టరీ సమాచారాన్ని 2025 డిసెంబర్ 31ను ప్రామాణిక తేదీగా తీసుకుని ఆగస్టు 10 నుంచి సెప్టెంబర్ 8 వరకు సేకరించనున్నట్లు తెలిపారు. ప్రతి అధికారి బాధ్యతతో పనిచేసి విశ్వసనీయ సమాచారాన్ని అందించాలని కోరారు.
వీడియో కాన్ఫరెన్స్‌లో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు..

RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
హైద్రాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in
8 శనివారం ఆగస్టు 2026

# తెలంగాణ సంస్కృతికి అద్దం పట్టిన బోనాల వేడుకలు

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఆగస్టు 7:-

హైదరాబాద్: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల వైభవాన్ని ప్రతిబింబించే బోనాల పండుగను పురస్కరించుకుని పాఠశాలలో విద్యార్థులు సందడి చేశారు. సంప్రదాయ దుస్తుల్లో ముస్తాబైన చిన్నారులు బోనాల వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొని పండుగ శోభను మరింత పెంచారు.వేడుకల్లో అమ్మవారి బోనం, పల్లకి, పోతరాజు వేషధారణ, డప్పు వాయిద్యాలు, జానపద నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విద్యార్థులు తెలంగాణ సంస్కృతి, బోనాల పండుగ ప్రాధాన్యతను వివరిస్తూ ప్రసంగాలు, పాటలు, నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. సంప్రదాయ కళారూపాలను కళ్లకు కట్టినట్లు ప్రదర్శిస్తూ విద్యార్థులు అలరించారు.

ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ ఎస్. రవికుమార్ మాట్లాడుతూ, పండుగలు కేవలం వేడుకలకే పరిమితం కాకుండా మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు పరిచయం చేసే వేదికలుగా నిలుస్తాయని అన్నారు. విద్యార్థుల్లో తెలంగాణ వారసత్వంపై అవగాహన, గౌరవభావాన్ని పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని తెలిపారు.కార్యక్రమంలో



కోఆర్డినేటర్ పి. భవాని, వైస్ ప్రిన్సిపల్ మల్లేశ్వరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు, సంప్రదాయ వేషధారణతో పాఠశాల ప్రాంగణం పండుగ వాతావరణాన్ని తలపించింది.

# ఆగస్టు 10న కలెక్టరేట్ ముట్టడికి కార్మికుల పిలుపు

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఆగస్టు 7:-

కేంద్ర ప్రభుత్వ కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఆగస్టు 10న రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ వద్ద నిర్వహించనున్న జైల్‌భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు డి. కిషన్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరుతూ ఆదిభట్ల సర్కిల్ పరిధిలోని తొర్రూర్, తుర్కయంజాల్ డివిజన్లలో వివిధ రంగాల కార్మికులకు సీఐటీయూ ఆధ్వర్యంలో కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రచారం నిర్వహించారు.అనంతరం సీఐటీయూ కార్యాలయంలో జరిగిన సమావేశంలో కిషన్ మాట్లాడుతూ కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా కేంద్ర ప్రభుత్వం విధానాలను రూపొందిస్తోందని విమర్శించారు. కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను పరిరక్షించాల్సిన అవసరం ఉందన్నారు. నాలుగు లేబర్ కోడ్‌ల అమలుతో కార్మికుల ఉద్యోగ భద్రత, వేతనాలు, సామాజిక భద్రత, పని పరిస్థితులపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని పేర్కొన్నారు.కార్మిక సంఘాల హక్కులను కాపాడటంతో పాటు కనీస వేతనాలు, పీఎఫ్, ఈఎస్ఐ, సంక్షేమ పథకాలను బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. కార్మిక, రైతు,



వ్యవసాయ కార్మిక సంఘాల దేశవ్యాప్త పిలుపులో భాగంగా జరిగే జైల్‌భరోలో ప్రతి కార్మికుడు భాగస్వామి కావాలని కోరారు.కార్యక్రమంలో కే. అరుణ్‌కుమార్, మొలుగు కృష్ణ, నార్లకంటి సాలయ్య, కందాల రవి, వెంకట్‌రెడ్డి, గోపాల్, ఎకోస్వామి, మేతరి సంతోష్, పరమేష్, కమలాకర్, ఆమీర్‌భాయ్, కృష్ణ, సురేష్, ఇమ్మానుయేల్ తదితరులు పాల్గొన్నారు.

# మహంకాళి అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి: సబితా ఇంద్రారెడ్డి

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఆగస్టు 7:-

కీసర: రాంపల్లి గ్రామంలోని శ్రీ మహంకాళి అమ్మవారి ఆలయాన్ని మహేశ్వరం ఎమ్మెల్యే, మాజీ మంత్రి పట్లోళ్ల సబితా ఇంద్రారెడ్డి దర్శించుకున్నారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు గండి అంజయ్య గౌడ్ ఆహ్వానం మేరకు ఆలయానికి చేరుకున్న ఆమెకు ఆలయ నిర్వాహకులు, పార్టీ నాయకులు స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.అర్చకులు ఆలయ సంప్రదాయాల ప్రకారం సబితా ఇంద్రారెడ్డికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని, గ్రామాలు అభివృద్ధి పథంలో ముందుకు



సాగాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల్లో ఐక్యత, భక్తి భావాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు.అనంతరం ఆలయ కమిటీ సభ్యులు సబితా ఇంద్రారెడ్డిని శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. అమ్మవారి దర్శనం అనంతరం ఆమె భక్తులతో




కొద్దిసేపు ముచ్చటించారు.కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మచ్చా శ్రీనివాస్ గౌడ్, నక్కిరెడ్డి శంకర్ రెడ్డి, ఏనుగు రామకృష్ణారెడ్డి, వరకాల పెంటయ్య గౌడ్, నల్లలో కుమార్, ఎల్లసాని బాలరాజ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. పార్టీ కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# తుమ్మలూరు గ్రామ కార్యదర్శిపై అవినీతి ఆరోపణలు.. డీఎల్‌పీఓ విచారణ






హైదరాబాద్ ఎస్టేట్ రంగారెడ్డి ప్రతినిధి కృష్ణ చారి ఆగస్టు 7

గ్రామ పంచాయతీ కార్యదర్శి అలివేలుపై అవినీతి, అక్రమాల ఆరోపణలు.. పై అధికారులకు నివేదిక ఇవ్వనున్న డీఎల్‌పీఓ

మహేశ్వరం, ఆగస్టు 07: రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం తుమ్మలూరు గ్రామ పంచాయతీ కార్యదర్శి అలివేలుపై గ్రామ సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామస్తులు చేసిన అవినీతి, అక్రమాల ఆరోపణలపై జిల్లా స్థానిక సంస్థల పంచాయతీ అధికారి (డీఎల్‌పీఓ) సాంబిరెడ్డి శుక్రవారం గ్రామంలో విచారణ నిర్వహించారు. ఫిర్యాదులో పేర్కొన్న అంశాలను పరిశీలించిన డీఎల్‌పీఓ.. పూర్తి నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించి వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.గ్రామ పంచాయతీ ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నప్పటికీ గ్రామ కార్యదర్శి అలివేలు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపించారు.పలుమార్లు ఫిర్యాదు చేసినా స్పందించకుండా అక్రమ నిర్మాణాలకు ప్రోత్సాహం కల్పిస్తున్నారని విమర్శించారు.గ్రామంలో ఉన్న వైకుంఠధామం సూచిక బోర్డుని ఎవరికి సమాచారం ఇవ్వకుండా తొలగించి మరో ప్రాంతంలో ఏర్పాటు చేశారని, ఆ స్థలంలో ప్రైవేట్ వెంచర్‌కు అనుకూలంగా వ్యవహరించారనే ఆరోపణలు కూడా గ్రామస్తులు చేశారు.

గ్రామ పంచాయతీ వ్యవహారాల్లో కార్యదర్శి భర్త జోక్యం చేసుకుంటున్నారని, అధికారిక వ్యవహారాల్లో ఆయన పెత్తనం సాగుతోందని ఆరోపించారు.ఈ వ్యవహారంపై గ్రామ పాలకవర్గం, గ్రామస్తులు డీపీఓ, డీఎల్‌పీఓ తదితర అధికారులకు ఫిర్యాదు చేయడంతో డీఎల్‌పీఓ సాంబిరెడ్డి గ్రామానికి చేరుకుని సంబంధిత ప్రాంతాలను పరిశీలించారు.అక్రమ నిర్మాణాలపై నిబంధనల ప్రకారం చర్యలు చేపట్టాలని గ్రామ కార్యదర్శిని ఆదేశించినట్లు తెలిసింది.

ఈ సందర్భంగా డీఎల్‌పీఓ మాట్లాడుతూ.. గ్రామ కార్యదర్శిపై వచ్చిన అన్ని ఆరోపణలపై సమగ్ర విచారణ నిర్వహించి నివేదికను పై అధికారులకు అందజేస్తామని, వారి ఆదేశాల మేరకు తదుపరి చర్యలు ఉంటాయని తెలిపారు.ఇదిలా ఉండగా, గ్రామంలో ఇన్ని ఆరోపణలు, ఫిర్యాదులు వచ్చినప్పటికీ ఎంపీడీఓ స్థాయిలో చర్యలు ఎందుకు తీసుకోలేదన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గ్రామ కార్యదర్శిని విధుల నుంచి తొలగించే వరకు తమ పోరాటం కొనసాగుతుందని గ్రామస్తులు హెచ్చరించారు.

గ్రామ కార్యదర్శి అలివేలు వివరణ

తాను ఎలాంటి అక్రమాలకు పాల్పడలేదని గ్రామ కార్యదర్శి అలివేలు స్పష్టం చేశారు. అక్రమ నిర్మాణాల విషయంలో సంబంధిత వారికి నోటీసులు జారీ చేశామని, ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు సమాచారం అందిస్తూ వారి ఆదేశాల మేరకే విధులు నిర్వహించానని తెలిపారు. తనపై వచ్చిన ఆరోపణలు వాస్తవం కాదన్నారు.

ఎంపీఓ రవీందర్ స్పందన

తన దృష్టికి వచ్చిన ప్రతి అక్రమ నిర్మాణంపై గ్రామ కార్యదర్శికి సమాచారం ఇచ్చి నోటీసులు జారీ చేయాలని ఆదేశించినట్లు ఎంపీఓ రవీందర్ తెలిపారు. గ్రామ పాలకవర్గం, గ్రామ కార్యదర్శి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించామని, ఈ వ్యవహారంలో తన వ్యక్తిగత ప్రమేయం లేదని చెప్పారు.

ఈ యొక్క కార్యక్రమంలో గ్రామ పెద్దలు అమనగంటి ప్రశాంత్ రెడ్డి, చెన్నరెడ్డి మహేందర్ రెడ్డి, దీనెల్,గోల్కొండ రఘువీర్, రాంచేంద్రరెడ్డి ,రాజమౌని నారాయణ, శ్రీశైలం, దుర్గాప్రసాద్, గట్టగల్ల శ్రీకాంత్, రమేష్, మల్లేష్,దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ కంఠం భూముల కోసం పేదల పోరుబాట




హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఆగస్టు 7:-

ఇబ్రహీంపట్నం:ఇబ్రహీంపట్నం మండలం దండు మైలారం గ్రామంలో గ్రామ కంఠం భూములను పేద ప్రజలకు కేటాయించాలని డిమాండ్ చేస్తూ గ్రామస్తులు చేపట్టిన ఆందోళన ఉధృతమైంది. భూములు లేని నిరుపేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరుతూ గత 14 రోజులుగా గ్రామంలో రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. అయినప్పటికీ సంబంధిత అధికారులు తమ సమస్యపై స్పందించకపోవడంతో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ నేపథ్యంలో శుక్రవారం దండు మైలారం గ్రామానికి చెందిన మహిళలు, ప్రజలు పెద్ద సంఖ్యలో ఇబ్రహీంపట్నం ఎంపీడీవో కార్యాలయం వద్దకు చేరుకుని ధర్నా నిర్వహించారు. గ్రామ కంఠం పరిధిలో ఉన్న భూములను గుర్తించి అర్హులైన పేదలకు స్థలాలు కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. ఎన్నో ఏళ్లుగా సొంత ఇల్లు లేక ఇబ్బందులు పడుతున్న పేద కుటుంబాలకు ప్రభుత్వం స్థలాలు కేటాయించాల్సిన అవసరం ఉందని మహిళలు పేర్కొన్నారు.14 రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్నప్పటికీ అధికారులు కనీసం తమ సమస్యను పట్టించుకోకపోవడం బాధాకరమని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల సమస్యలను పరిష్కరించాల్సిన అధికారులు స్పందించకపోవడంతోనే ఎంపీడీవో కార్యాలయం ముందు ధర్నాకు దిగాల్సి వచ్చిందని తెలిపారు.గ్రామ కంఠం భూముల సమస్యపై అధికారులు వెంటనే దృష్టి సారించి, అర్హులైన పేదలకు స్థలాలు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని గ్రామ మహిళలు, ప్రజలు కోరారు. తమ డిమాండ్లు పరిష్కరించే వరకు ఆందోళనలను కొనసాగిస్తామని వారు స్పష్టం చేశారు.

# గ్రామంలో ప్రతి కుటుంబంలో సంతోషమే మా లక్ష్యం

## జన్మించిన ప్రతి శిశువుకు 11000/- ఆర్థిక సహాయం సర్పంచ్ వినోద్ రాథోడ్

( హైదరాబాద్ ఎస్టేట్ రంగారెడ్డి ప్రతినిధి కృష్ణ చారి ఆగస్టు 07:)



రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం మహేశ్వరం మండల కేంద్రంలోని పడమటి తండా గ్రామంలోని ప్రతి కుటుంబ సంతోషమే మా లక్ష్యం. కొత్తగా జన్మించిన ప్రతి శిశువుకు ₹1,000 ఆర్థిక సహాయం అందజేసే కార్యక్రమాన్ని వినోద్ రాథోడ్ , పడమటి తండా సర్పంచ్, ప్రస్తుతం అమలు చేస్తున్నారు.తల్లి శిశు సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ, గ్రామ ప్రజల సంక్షేమం కోసం ఈ సహాయ కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగింది."ప్రతి పుట్టుకకు ప్రోత్సాహం ప్రతి కుటుంబానికి భరోసా"గ్రామ అభివృద్ధి, ప్రజల సంక్షేమమే మా ధ్యేయం.ఈ కార్యక్రమం లో పడమటి తండా సర్పంచ్, వార్డ్ సభ్యులు రమేష్, భాస్కర్, రాములు, మురళి, శ్రీకాంత్, గోపి, శంకర్, జగన్...వినోద్ రాథోడ్ సర్పంచ్, పడమటి తండా

# అఖిల గాండ్ల తెలికుల సంఘం రాష్ట్ర ఎన్నికలకు ముహూర్తం

### ఆగస్టు 23న హైదరాబాద్‌లో రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కమిటీ ఎన్నికలు

### 39 పదవులకు ఎన్నికలు.. ఎన్నికల షెడ్యూల్ విడుదల

హైదరాబాద్, ఆగస్టు 07:

అఖిల గాండ్ల తెలికుల సంఘం తెలంగాణ (రిజి. నెం. 985/2014) రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కమిటీ ఎన్నికలకు సంబంధించిన పూర్తి షెడ్యూల్‌ను ప్రధాన ఎన్నికల అధికారి శ్రీ వెన్నంపల్లి శ్రీనివాస్ విడుదల చేశారు. రాష్ట్ర సంఘానికి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకునేందుకు మొత్తం 39 ఎగ్జిక్యూటివ్ కమిటీ పదవులకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు ప్రకటించారు.

ఎన్నికల ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా, ప్రజాస్వామ్య పద్ధతిలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేపట్టినట్లు ఎన్నికల అధికారి తెలిపారు. సంఘం రాజ్యాంగం, ఎన్నికల నిబంధనల ప్రకారం షెడ్యూల్ అమలు చేయనున్నట్లు పేర్కొన్నారు.

విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం ఆగస్టు 9, 2026 నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభమవుతుంది. అభ్యర్థులు ఆగస్టు 11 వరకు నామినేషన్లు దాఖలు చేసుకోవచ్చు. అనంతరం ఆగస్టు 12న నామినేషన్ల పరిశీలన నిర్వహించనుండగా, ఆగస్టు 18 వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం కల్పించారు. తుది అభ్యర్థుల జాబితా ప్రకటించిన అనంతరం ఆగస్టు 23, 2026న హైదరాబాద్‌లో పోలింగ్ నిర్వహించనున్నారు.

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సంఘ సభ్యులు ప్రజాస్వామ్య స్ఫూర్తితో ఎన్నికల్లో పాల్గొని, అర్హులైన నాయకత్వాన్ని ఎన్నుకోవాలని ప్రధాన ఎన్నికల అధికారి పిలుపునిచ్చారు. ఎన్నికల నిర్వహణలో సభ్యులందరూ సహకరించి, ఎన్నికలను విజయవంతం చేయాలని కోరారు.

ఎన్నికలకు సంబంధించిన పూర్తి వివరాలు, నామినేషన్ ప్రక్రియ, అర్హతలు, నియమావళి తదితర సమాచారం కోసం ప్రధాన ఎన్నికల అధికారి శ్రీ వెన్నంపల్లి శ్రీనివాస్ను 99496 39015 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఎన్నికల షెడ్యూల్

- నామినేషన్ల ప్రారంభం: 09-08-2026
- నామినేషన్ల ముగింపు: 11-08-2026
- నామినేషన్ల పరిశీలన: 12-08-2026
- నామినేషన్ల ఉపసంహరణ: 18-08-2026
- పోలింగ్: 23-08-2026 (హైదరాబాద్)

"ప్రజాస్వామ్య పద్ధతిలో, పారదర్శకంగా ఎన్నికలు నిర్వహిస్తాం. సభ్యులందరూ ఎన్నికల ప్రక్రియలో చురుకుగా పాల్గొని సంఘ అభివృద్ధికి తోడ్పడాలి." అని ప్రధాన ఎన్నికల అధికారి శ్రీ వెన్నంపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు.

RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
హైద్రాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in
8 శనివారం ఆగస్టు 2026

# ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించిన కేఎల్ఆర్

### జిహెచ్ఎంసి/ ఎమ్మెల్సీ ఎన్నికల వరకూ బిఎల్ఏ ఎస్ కు ఓటర్ల బాధ్యత

### పని చేసే వారికే పార్టీ/ నామినేటెడ్ పదవులు: కిచ్చెన్న



( హైదరాబాద్ స్టేట్ రంగారెడ్డి ప్రతినిధి కృష్ణ ఆగస్టు 07:) ఆగస్టు 10తో రాష్ట్రంలో సర్ ప్రక్రియ ముగుస్తున్నందున్న మహేశ్వరం నియోజకవర్గంలో జరుగుతున్న ఎన్యూమరేషన్ ఫారమ్స్ డిజిటలైజేషన్ శాతాన్ని తెలుసుకున్నారు కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి.మహేశ్వరం నియోజకవర్గం సరూర్నగర్ / ఎన్టీఆర్ నగర్ /ప్రశాంతిహిల్స్ /బడంగ్ పేట డివిజన్లల్లో విస్తృతంగా పర్యటించారు కెఎల్ఆర్& డిబిఆర్ ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణను బిఎల్ఓ ఎస్ /బిఎల్ఏ ఎస్ పార్టీ అధ్యక్షులు, ఇన్చార్జులు, అబ్జర్వర్లు, కో ఆర్డినేటర్స్ నుంచి వివరాలు సేకరించారు. సర్ సహా పార్టీ కార్యక్రమాలను విజయవంతంగా ప్రజల్లోకి తీసుకెళ్లిన వారిని గుర్తించి మంత్రులు సహా ఢిల్లీ పెద్దలతో సన్మానం, పార్టీ పదవులు, నామినేటెడ్ పదవులు ఇస్తామని కిచ్చెన్న భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు దేప భాస్కర్ రెడ్డి సహా మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ నాయకులు, మహిళా నాయకురాళ్లు పాల్గొన్నారు.

# గంగారం తండాలో ట్రాన్స్ఫార్మర్ పైకి ఎక్కి చెట్ల కొమ్మలను తొలగించిన సర్పంచ్ దేవేందర్ నాయక్

## - చిన్నారులకు తల్లిపాలే శ్రీరామరక్ష సర్పంచ్ దేవేందర్ నాయక్

( హైదరాబాద్ ఎస్టేట్ రంగారెడ్డి ప్రతినిధి కృష్ణ చారి ఆగస్టు 07:) రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం మహేశ్వరం మండల కేంద్రంలోని గంగారం గ్రామపంచాయతీ పరిధిలోని గంగారం గంగారం తండా మైలార్ బై తండా లోని ట్రాన్స్ఫర్ లకు పిచ్చి కొమ్మలు చెట్లను తొలగించడం జరిగింది . వర్షం కాలం కారణంగా విద్యుత్ అంతరాయం కలగకుండా ముందు జాగ్రత్తగా గ్రామ సర్పంచ్ దేవేందర్ నాయక్ గ్రామపంచాయతీ పాలకవర్గం నుండి సిబ్బందిలతో ముళ్ళు చెట్లను తొలగించడం జరిగింది అదేవిధంగా తల్లిపాలలతోనే శిశువులకు సంపూర్ణంగా ఆరోగ్యంగా ఉంటారని గ్రామ సర్పంచ్ దేవేందర్ నాయక్ ఆధ్వర్యంలో శుక్రవారం రోజున గంగారం తండా అంగన్వాడి స్కూల్లోని తల్లిపాల వారోత్సవాన్ని నిర్మించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తల్లి పుట్టిన పాపకు గంటలోపుననే శిశువులకు పాలు ఇవ్వాలి ప్రభుత్వం అంగన్వాడి కేంద్రాలకు ద్వారా అందిస్తున్న సేవలను సద్వినియంగా ఉపయోగించుకోవాలని గ్రామ మహిళలకు ప్రతి ఒక్కరూ తల్లి బిడ్డకు క్షేమంగా ఉండాలని కోరుకుంటూ ప్రతి పుట్టబోయే పిల్లలకు నాణ్యమైన ఆహారం పాలు ఇవ్వాలని కోరుకుంటూ మీ గ్రామ సర్పంచ్ దేవేందర్ నాయక్ ఆధ్వర్యంలో పాల్గొన్నవారు ఉప సర్పంచ్ మహేందర్ ఎం దేవా ఎం మోహన్ కే రాజు ఎం లావణ్య శ్రీనివాస్ ఎం శ్రీనివాస్ అంగన్వాడి టీచర్ రూప స్కూల్ టీచర్ శ్రీధర్ మరి గ్రామ మహిళలు గ్రామ ప్రజలు పాల్గొన్నారు



# బోనాలకు ముందు మద్యం బంద్..

## - ఫ్యూచర్ సిటీ పోలీసుల కీలక నిర్ణయం



హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఆగస్టు 7:- ఫ్యూచర్ సిటీ: బోనాల పండుగను పురస్కరించుకుని ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మద్యం విక్రయాలపై ఆంక్షలు విధించారు. పండుగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా శాంతిభద్రతలను కాపాడే ఉద్దేశంతో పోలీస్ శాఖ ఈ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు పోలీస్ కమిషనర్ డా. తరుణ్ జోషి, ఐపీఎస్ తెలంగాణ ఎక్సైజ్ చట్టం1968లోని సెక్షన్ 20 ప్రకారం ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేశారు.ఉత్తర్వుల ప్రకారం ఆగస్టు 9వ తేదీ ఉదయం 10 గంటల నుంచి ఆగస్టు 10వ తేదీ ఉదయం 6 గంటల వరకు కమిషనరేట్ పరిధిలోని అన్ని వైన్ షాపులు, రెస్టారెంట్లకు అనుబంధంగా నిర్వహించే బార్లు మూసివేయాల్సి ఉంటుంది. నిర్ణీత సమయంలో మద్యం విక్రయాలు, సరఫరా జరగకుండా సంబంధిత నిర్వాహకులు నిబంధనలు పాటించాలని అధికారులు స్పష్టం చేశారు.అయితే స్టార్ హోటళ్లలో నిర్వహించే బార్లు, రిజిస్టర్డ్ క్లబ్‌ల పరిధిలోని బార్లకు ఈ ఆంక్షలు వర్తించవని పోలీసులు వెల్లడించారు. బోనాల వేడుకలు ప్రశాంతంగా, సురక్షిత వాతావరణంలో జరిగేలా పోలీస్ శాఖ ముందస్తు చర్యలు చేపట్టింది. ప్రజలు పండుగను శాంతియుతంగా జరుపుకోవాలని, మద్యం దుకాణాలు, బార్ల నిర్వాహకులు పోలీసుల ఆదేశాలను తప్పనిసరిగా పాటించి సహకరించాలని కమిషనరేట్ విజ్ఞప్తి చేసింది.

# బోనాల పండుగ సందర్భంగా ఐమాక్స్ లైట్లు ప్రారంభించిన సర్పంచ్ లింగం ముదిరాజ్,షాహబుద్దీన్ ఖాన్





( హైదరాబాద్ ఎస్టేట్ రంగారెడ్డి ప్రతినిధి కృష్ణ చారి ఆగస్టు 07:) రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం మహేశ్వరం మండల కేంద్రంలోని పెద్దపులి నాగారం గ్రామంలో... ఆదివారం బోనాల సందర్భంగా.. గ్రామంలో విద్యుత్ అంతరాయం లేకుండా గ్రామం మొత్తం లైట్లతో వెలుగులు ఉండాలనే ఉద్దేశంతో ఐమాక్స్ లైట్లును గ్రామ సర్పంచ్ ప్రారంభించడం జరిగింది ఈ యొక్క కార్యక్రమంలో.. వార్డు సభ్యులు.. షాహబుద్దీన్ ఖాన్, నయీమ్ ఖాన్, తలారి రాజు, గణపురం రాజు, ఎండి అన్వర్ ఖాన్, మాజీ వార్డు సభ్యులు కొత్తపల్లి సిద్దులు, గాజులపల్లి నరసింహ, అంబేద్కర్ సంఘం అధ్యక్షులు బూరుల నవీన్ కుమార్, వివిధ పార్టీ నాయకులు.. గ్రామ పెద్దలు యువకులు నాయకులు ఈ యొక్క కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొనడం జరిగింది

# రాజమండ్రిలో వైద్య విద్యార్థిని ప్రియాంక మృతి అత్యంత విషాదకరం బాధ్యులను వెంటనే అరెస్ట్ చేయాలి

## : డా. పిట్టా వరప్రసాద్



హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ ప్రతినిధి కాకినాడ, ఆగస్టు 7:
రాజమండ్రిలో సినీ థియేటర్ బయటకు వెళ్లే గేటు వద్ద మద్యం మత్తులో కారుతో ఢీకొట్టిన ఘటనలో తీవ్రంగా గాయపడిన వైద్య విద్యార్థిని ప్రియాంక చికిత్స పొందుతూ మృతి చెందడం అత్యంత విషాదకరమని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (అంబేద్కర్) రాష్ట్ర అధ్యక్షులు మరియు జాతీయ కార్యదర్శి డా. పిట్టా వరప్రసాద్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.ప్రియాంక కుటుంబ సభ్యులకు పార్టీ తరఫున ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. నిర్లక్ష్యంగా వాహనం నడిపి ఒక యువ విద్యార్థిని ప్రాణాలు కోల్పోయే పరిస్థితి రావడం అత్యంత దురదృష్టకరమని పేర్కొన్నారు.ఘటనకు సంబంధించిన కారు నంబర్ తెలిసి కూడా ఇప్పటివరకు నిందితులను అరెస్ట్ చేయకపోవడం పోలీసు శాఖ నిర్లక్ష్య వైఖరికి నిదర్శనమని డా. పిట్టా వరప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధ్యులను వెంటనే గుర్తించి చట్టం ముందు నిలబెట్టి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా రాష్ట్ర ప్రభుత్వం, పోలీసు శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టాలని, ప్రమాదాలకు కారణమైన వారిపై వేగవంతమైన విచారణ నిర్వహించి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని ఆయన కోరారు.

# బంగారం రాగి అన్వేషణకు సింగరేణి తొలి అడుగు మైన్స్ అండ్ జియాలజీ శాఖతో ఒప్పందం

### ఐదేళ్లలో అన్వేషణ పూర్తి చేస్తాం

### సింగరేణి ప్రాజెక్ట్స్ & ప్లానింగ్ డైరెక్టర్ కె. వెంకటేశ్వర్లు





హైదరాబాద్ ఎస్టేట్ ఆగష్టు 07 మంచిర్యాల
సింగరేణి సంస్థ కర్ణాటక రాష్ట్రంలోని రాయచూర్, యాదగిరి జిల్లాల్లో విస్తరించి ఉన్న దేవదుర్గ బ్లాక్ లో బంగారం, రాగి ఖనిజాల అన్వేషణలో మరో కీలక ముందడుగు వేసింది. గతంలో ఈ అన్వేషణకు కేంద్ర ప్రభుత్వ వేలంలో లైసెన్స్ పొందిన నేపథ్యంలో, ఇప్పుడు అన్వేషణ పనులు ప్రారంభించేందుకు కర్ణాటక రాష్ట్ర మైన్స్ అండ్ జియాలజీ శాఖతో సింగరేణి సంస్థ ఒప్పందం కుదుర్చుకుంది. బెంగళూరులోని కర్ణాటక మైన్స్ అండ్ జియాలజీ శాఖ కార్యాలయంలో గురువారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో కర్ణాటక డీఎంజీ డైరెక్టర్ రంగప్ప , సింగరేణి డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ & ప్లానింగ్) కె. వెంకటేశ్వర్లు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఈ ఒప్పందం ప్రకారం, సింగరేణి సంస్థకు లైసెన్స్ లభించిన దేవదుర్గ ప్రాంతంలోని 199.13 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో అన్వేషణను ఐదేళ్లలో పూర్తి చేయడానికి అంగీకారం కుదిరింది. ఈ సందర్భంగా డైరెక్టర్ (ప్రాజెక్ట్స్) అండ్ ప్లానింగ్ కె.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. దేవదుర్గ ప్రాంతంలోని బంగారం, రాగి ఖనిజాల అన్వేషణకు సింగరేణి గతంలోనే లైసెన్స్ సాధించిందని, ఇప్పుడు వాస్తవ అన్వేషణ కార్యక్రమం ప్రారంభించేందుకు అవసరమైన ఒప్పందం కుదిరిందన్నారు.
ఇప్పటికే అధికారులను నియమించామని, త్వరలో మిగిలిన అధికారులు, సిబ్బందిని కూడా నియమించి రెండేళ్లలోపు +4 అన్వేషణను విజయవంతంగా పూర్తి చేస్తామని తెలిపారు. ఇతర రాష్ట్రంలో ఈ స్థాయిలో ఖనిజ అన్వేషణ చేపట్టడం సింగరేణి చరిత్రలో ఇదే తొలిసారి అని పేర్కొన్న ఆయన, 13 దశాబ్దాల అన్వేషణ అనుభవం కలిగిన సంస్థగా ఈ కొత్త ప్రాజెక్టును కూడా విజయవంతంగా పూర్తి చేస్తామనే పూర్తి విశ్వాసం తమకు ఉందని తెలిపారు.
ఈ సందర్భంగా సహకారం అందించిన కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వానికి, మైన్స్ అండ్ జియాలజీ శాఖకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.
అన్వేషణ కార్యక్రమంలో భాగంగా రిమోట్ సెన్సింగ్, జియోలాజికల్ మ్యాపింగ్, జియోఫిజికల్ సర్వేలు నిర్వహించి, ఎంపిక చేసిన ప్రాంతాల్లో స్కౌట్ డ్రిల్లింగ్ చేపడతారు. అనంతరం సేకరించిన నమూనాలపై పెట్రోగ్రాఫిక్ మరియు మినరలాజికల్ అధ్యయనాలు నిర్వహిస్తారు. ఈ నమూనాలపై సమగ్ర మూలకాల విశ్లేషణను కొత్తగా కొత్తగూడెంలో ఏర్పాటు చేసిన సింగరేణి జియోసైన్స్ ల్యాబొరేటరీలో చేపట్టనున్నారు. అనంతరం సమగ్ర నివేదికను కర్ణాటక మైన్స్, జియాలజీ శాఖకు సమర్పిస్తారు. ఆ నివేదిక ఆధారంగా మరింత విస్తృత స్థాయి అన్వేషణ చేపట్టే అవకాశం ఉంటుంది. కార్యక్రమంలో ఎక్స్ప్లోరేషన్ జీఎం పంకజ్ కుల శ్రేష్ట, డీజీఎం (జియాలజీ) వి.రాజేశ్వర్, డీవైఎఫ్ఎం శ్రీమతి లక్ష్మీప్రియ, సీనియర్ లా ఆఫీసర్ ప్రభందిత తదితరులు పాల్గొన్నారు.

# కరాటే సాధనతో ఆత్మవిశ్వాసం



హైదరాబాద్, ఆగస్టు 07:
కరాటే సాధన వల్ల క్రమశిక్షణతో పాటు ఆత్మవిశ్వాసం పెరుగుతుందని సమురాయ్ ప్రొఫెషనల్ కరాటే అసోసియేషన్ వ్యవస్థాపకులు, డైరెక్టర్ కియోషి సిద్దార్ధ్ షా అన్నారు. శుక్రవారం నారాయణగూడలోని సమురాయ్ ప్రొఫెషనల్ కరాటే అకాడమిలో నిర్వహించిన బెల్ట్ గ్రేడ్ టెస్ట్ లో ఉత్తీర్ణులైన 35 మంది విద్యార్థులకు కరాటే కలర్ బెల్ట్స్ తో పాటు సర్టిఫికెట్స్ ను ఆయన ప్రదానం చేశారు. కిక్కర్స్ మార్షల్ ఆర్ట్స్ స్పోర్ట్స్ ఫెడరేషన్ గ్రాండ్ మాస్టర్ బి. నాగరాజు, మాస్టర్ సురేందర్, షోటోకాన్ కరాటే గ్రాండ్ మాస్టర్ సుబ్బు బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ పరిశీలకులుగా వ్యవహరించారు. విద్యార్థులు విద్యతో పాటు అన్ని రంగాల్లోనూ రాణించాలని సూచించారు. ఆత్మరక్షణ కోసం ప్రతి ఒక్క విద్యార్థి కరాటే నేర్చుకోవాలని అన్నారు.

# పాపన్నపేటలో ఘనంగా 12వ జాతీయ చేనేత దినోత్సవ వేడుకలు





మెదక్,ఆగస్టు07 (హైద్రాబాద్ ఎస్టేట్): జాతీయ చేనేత దినోత్సవం పురస్కరించుకుని మండల కేంద్రమైన పాపన్నపేట చేనేత సహకార సంఘంలో శుక్రవారం నాడు వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈకార్యక్రమానికి మెదక్ జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షులు మ్యాకల జయరాములు,మెదక్ పద్మశాలి సంఘం అధ్యక్షులు బోద్దుల సంతోష్ లు హాజరయ్యారు.
ఈ సందర్భంగా చేనేత జాతి పిత కొండా లక్ష్మణ్ బాపూజీ,మార్కండేయ మహరాజ్ చిత్ర పటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఇటీవల నూతనంగా ఎన్నికైన అధ్యక్ష,కార్యదర్శులను శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో పాపన్నపేట పద్మశాలి సహకార సంఘం అధ్యక్షులు కొడపాక విట్టల్,మండల పద్మశాలి సంఘం అధ్యక్షుడు వళ్ళందేశి శ్రీనివాస్,ఉపాధ్యక్షులు పల్లె సంగమేశ్వర్,డైరెక్టర్ లు పద్మశాలి సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
హైద్రాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in



# గెలుపోటములను సమానంగా స్వీకరించాలి

## అసిస్టెంట్ ఇన్స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (సిఐడి) జె.అన్యోన్య

హైదరాబాద్, ఆగస్టు 06: క్రీడల్లో జయాపజయాలను సమానంగా స్వీకరించాలని అసిస్టెంట్ ఇన్స్ పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (సిఐడి) జె. అన్యోన్య అన్నారు. వైఎంసీఏ గ్రేటర్ హైదరాబాద్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న వైఎంసీఏ కార్గిల్ విక్టరీ స్పోర్ట్స్ ఫెస్టివల్ ను గురువారం నారాయణగూడ లోని వైఎంసీఏ క్రీడా మైదానంలో ఆయన ప్రారంభించారు. భవిష్యత్ మీదే.. చాంపియన్లు మీరేనని.. ఒక లక్ష్యం ఏర్పరచుకుని ముందుకు సాగి జీవితంలో చాంపియన్లుగా నిలవాలని సూచించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో ఉత్తమ ప్రతిభ చూపడం ద్వారా ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని అన్నారు. ఈ సందర్భంగా బాలబాలికలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ తదితర



క్రీడా పోటీలను నిర్వహించారు. వైఎంసీఏ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు డాక్టర్ జోనతన్ ధర్మరాజు, ఉపాధ్యక్షులు జిఎం దీన్దియాల్, సిఐడి ఇన్స్ పెక్టర్



విజయ్ కుమార్, వైఎంసీఏ బోర్డు కన్సల్టెంట్ బి.జె. వినయస్వరూప్, వైఎంసీఏ ప్రధానకార్యదర్శి ప్రిస్ట్ లీ గ్రైస్, తదితరులు పాల్గొన్నారు.

# ధర్మన్నగూడ ఉప సర్పంచ్ నాగరాజుపై దాడి

## ముగురిపై పోలీసులకు ఫిర్యాదు

హైదరాబాద్ ఎస్టేట్ యాచారం ప్రతినిధి రామాచారి ఆగస్టు 7

రంగారెడ్డి జిల్లా, ఇబ్రహీంపట్నం నియోజకవర్గం యాచారం మండలం ధర్మన్నగూడ గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనుల సందర్భంగా చోటుచేసుకున్న ఘర్షణ స్థానికంగా కలకలం రేపింది. గ్రామంలో కొనసాగుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను అడ్డుకుంటూ కొందరు తనపై దాడికి పాల్పడ్డారని ధర్మానగూడ ఉప సర్పంచ్ నాగరాజు ఆరోపించారు. ఈ ఘటనతో గ్రామంలో కొంతసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.ఉప సర్పంచ్ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం, గ్రామ ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వం మంజూరు చేసిన సీసీ రోడ్డు పనులు కొనసాగుతున్న సమయంలో కొందరు వ్యక్తులు అక్కడికి చేరుకుని పనులను అడ్డుకునేందుకు ప్రయత్నించారని తెలిపారు. ఈ క్రమంలో తనతో వాగ్వాదానికి దిగడంతో పాటు అసభ్య పదజాలంతో దూషించి, తనపై దాడి చేశారని ఆరోపించారు.

ఈ ఘటనకు సంబంధించి బండ చెన్నయ్య, శ్రీశైలం, శ్రీనివాస్ యాచారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు నాగరాజు వెల్లడించారు. ప్రజాప్రతినిధిగా గ్రామ అభివృద్ధి కోసం పనిచేస్తున్న తనపై దాడి చేయడం బాధాకరమని, ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజాప్రతినిధుల పట్ల ఇలాంటి ప్రవర్తన సరికాదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

గ్రామ ప్రజల సౌకర్యార్థం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను రాజకీయాలు లేదా వ్యక్తిగత విభేదాలతో అడ్డుకోవడం వల్ల గ్రామంలో రహదారులు, డ్రైనేజీలు, తాగునీటి సదుపాయాలు వంటి మౌలిక వసతుల కల్పన కోసం ప్రజాప్రతినిధులు కృషి చేస్తున్న సమయంలో ఇలాంటి ఘటనలు జరగడం విచారకరమని అన్నారు.దాడికి పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన పోలీసులను కోరారు. తనకు, తన కుటుంబ సభ్యులకు రక్షణ కల్పించడంతో పాటు గ్రామంలో



ప్రశాంత వాతావరణం కొనసాగేందుకు తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అభివృద్ధి పనులను ఎలాంటి ఆటంకాలు లేకుండా పూర్తి చేసేందుకు అధికార యంత్రాంగం సహకరించాలని కోరారు.

ఫిర్యాదు స్వీకరించిన యాచారం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఘటన జరిగిన ప్రాంతాన్ని పరిశీలించిన పోలీసులు ప్రత్యక్ష సాక్షుల వాంగ్మూలాలు సేకరిస్తున్నారు.ఇరువర్గాల వాదనలు నమోదు చేసి, వాస్తవ పరిస్థితులపై విచారణ చేపడుతున్నట్లు సమాచారం. దర్యాప్తు అనంతరం చట్టప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

# గోపాలపురం పాఠశాల గదుల నిర్మాణానికి రూ.25 లక్షలు మంజూరు

### - ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలతో పాఠశాలను సందర్శించిన కలెక్టర్

### - ఉపాధ్యాయినితో మాట్లాడిన సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీధర్

హైదరాబాద్: గోపాలపురం ప్రాథమిక పాఠశాలలో గదుల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.25 లక్షలు మంజూరు చేసింది. ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం గోపాలపురం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గదులు శిథిలమైన తీరుపై ఈనాడు పత్రికలో ప్రచురితమైన కథనానికి ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి స్పందించారు. వెంటనే పాఠశాలను సందర్శించి, వసతుల కల్పనకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని కలెక్టర్ దివాకరను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ ఎన్.శ్రీధర్ ఉపాధ్యాయిని ఇందిరతో మాట్లాడారు. పాఠశాలలో పరిస్థితులను గురించి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలతో కలెక్టర్ దివాకర గురువారం పాఠశాలను సందర్శించారు. పాఠశాల అభివృద్ధిపై చొరవ చూపిన ఉపాధ్యాయిని నిమ్మతోట ఇందిరను అభినందించారు. పాఠశాలలో గదుల నిర్మాణానికి రూ.25 లక్షలు విడుదల చేస్తున్నట్లు ఆమెకు తెలియజేశారు. ఆ వెంటనే నిధులు మంజూరు చేశారు.



# హైకోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించిన సీఐపై చర్యలు తీసుకోవాలి

హైదరాబాద్, ఆగస్టు 07: ఆస్తి వివాదంలో సనత్ నగర్ సీఐ అశోక్ ఏకపక్షంగా వ్యవహరిస్తూ బాధితుడు ప్రేమ్చందరు వేదింపులకు గురిచేస్తున్నాడని ఆర్పీఐ జాతీయ కార్యదర్శి పేరం శివనాగేశ్వర్ రావు గౌడ్ ఆరోపించారు. ఈ మేరకు సీఐ అశోక్ పై చట్టరిత్యా తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ శుక్రవారం నగర పోలీస్ కమీషనర్ సజ్జనార్ ను నాగేశ్వర్ రావు గౌడ్ ఆధ్వర్యంలో ప్రతినిధులు కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం కాచిగూడలో ఆయన మాట్లాడుతూ... ఫతేనగర్ ప్రాంతానికి చెందిన ప్రేమ్ చంద్ ఆస్తి విషయంలో స్పష్టమైన హైకోర్టు ఉత్తర్వులు ఉన్నప్పటికి వాటిని సీఐ పట్టించుకోకుండా ఏకపక్షంగా వ్యవహరిస్తున్నాడని పేర్కొన్నారు. ఆస్తి విషయంలో ప్రేమ్ చంద్ కు చట్టబద్దంగా హక్కులు ఉన్నప్పటికీ ఆ ఆస్తిలోకి ప్రేమచంద్ వెల్లకుండా సీఐ అడ్డుకుంటున్నాడని పేర్కొన్నారు. సీఐ హైకోర్టు ఉత్తర్వులు ఉల్లంఘించడం, పోలీస్ అధికారాన్ని దుర్వినియోగం, తప్పుడు క్రిమినల్ కేసులు నమోదు చేసినందుకు సీఐ పై చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.



2025 - 26 విద్యా సంవత్సరానికి గాను దేశంలోని ఐదు సరికొత్త ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటి) లలో మొత్తం ఒక వెయ్యి 1,364 కొత్త కొత్త సీట్లను చేర్చినట్లును చేర్చినట్లు విద్యామంత్రిక శాఖ అధికారికంగా ధ్రువీకరించింది. అండర్ గ్రాడ్యుయేట్ (ఖ+) మరియు పీహెచ్డీ ప్రోగ్రాంలో కింద ఈ సీట్లను చేర్చడం ద్వారా ఈ సంస్థల విద్యాసామర్థ్యం గణనీయంగా విస్తరించబడింది.




ఏ ఐఐటీలలో ఎన్ని సీట్లు పెరిగాయి?

ఈ విస్తరణలో, ఐఐటి బిలాయి అత్యధికంగా 378 సీట్లను పొందగా, ఆ తర్వాత ఐఐటి ధార్వాడ్ 343, ఐఐటి జమ్ము 251, ఐఐటి తిరుపతి 199 మరియు ఐఐటి పాలకాడు 193 కొత్త సీట్లను పొందాయి.

రానున్న నాలుగేళ్లలో మొత్తం 6576 సీట్లు జోడించనున్నారు.

దుర్గం వివేక్ ప్రేమ్ రత్నం
సబ్ ఎడిటర్
హైదరాబాద్ ఎస్టేట్
తెలుగు దినపత్రిక.

# తిరుమల ఘాట్ రోడ్డులో ప్రమాదం.. లోయలో పడిన కారు, ఒకరి మృతి

తిరుమలలో విషాదం నెలకొంది. శ్రీవారి దర్శనం అనంతరం తిరిగి వెళుతున్న భక్తుల కారు అదుపుతప్పి లోయలో పడటంతో ఒకరు చికిత్స పొందుతూ మృతి చెందగా, మరో నలుగురు స్వల్పంగా గాయపడ్డారు. ఈ ప్రమాదం శు క్రవారం తిరుమల నుంచి తిరుపతికి వచ్చే మొదటి ఘాట్ రోడ్డులో చోటుచేసుకుంది.బెంగళూరులోని గొట్టిగెరెకు చెందిన సతీష్ కుమార్ (72) తన కుటుంబ సభ్యులతో కలిసి శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చారు. స్వామివారి దర్శనం ముగించుకుని కారులో తిరుగు ప్రయాణమైన క్రమంలో, 22వ హెయిర్‌పిన్ బెండ్ వద్ద వాహనం అదుపుతప్పింది. వేగంగా వెళుతూ రక్షణ గోడను ఢీకొట్టిన కారు, సుమారు 15 అడుగుల లోతులో ఉన్న లోయలో పడిపోయింది.ఈ ప్రమాదంలో సతీష్ కుమార్ కుమారుడు సాయి శ్రీనివాస్, కుమార్తె సింధు ఉడత్, మనవరాళ్లు తియా, నైరాలకు స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాదం సమాచారం అందుకున్న పోలీసులు, సహాయక బృందాలు తక్షణమే ఘటనా స్థలానికి చేరుకున్నాయి. క్షతగాత్రులను తిరుపతిలోని స్విమ్స్ ఆసుపత్రికి తరలించి మెరుగైన చికిత్స అందిస్తున్నారు. సతీశ్ కుమార్ చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ ఘటనతో ఆ కుటుంబంలో తీవ్ర విషాదం అలుముకుంది.









